ఘనంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీలాపార్క్‌ప్రైడ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. బుధవారం ఉత్సవ మూర్తులకు 108 కలశములతో ఏకాదశ ఫలరస స్నపన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గురువారం ఉదయం 10 గంటలకు శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఛైర్మన్ కె.కొండల్‌రావు, తిలోత్తమ దంపతుల సహకారంతో అన్నసమారాధన ఉంటుందని కాలనీ అధ్యక్షుడు అల్లూరి మురళీకృష్ణ తెలిపారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్‌లోని షిరిడీ సాయిబాబా దేవాలయం 17వ వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సాధు ప్రతాప్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు కాగడ హారతి, 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, కంకణధారణ, శత కలశ స్థాపన.. 8 గంటలకు శత కలశ అభిషేకం, పంచామృత అభిషేకం, అలంకారం.. మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న హారతి.. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నసమారాధన.. సాయంత్రం 6 గంటలకు ధూప్ హారతి.. 6.45 గంటలకు పల్లకీ సేవ.. రాత్రి 8 గంటలకు తేజ్ హారతి.. రాత్రి 9గంటలకు తీర్థప్రసాదాల స్వీకరణ ఉంటుందన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే పూజా కార్యక్రమాలు, అన్న సమరాధనకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ప్రతాప్ రెడ్డి కోరారు.

నేడు దక్షిణమూర్తి విగ్రహావిష్కరణ

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నుంచి హైటెక్‌సిటీ వెళ్లే రోడ్డులోని పోచమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో గురువారం మేధా దక్షిణమూర్తి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ఆలయ కమిటీ కోశాధికారి నూతి రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. విజయ వర్మ, సౌమ్య దంపతులచే ఉ.7.22 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



పూజల్లో పాల్గొన్న బండి రమేష్, సత్యం శ్రీరంగం, తూము వేణు తదితరులు

ఘనంగా పోచమ్మ ఆలయ ప్రతిష్ఠ

అల్లాపూర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ ఫేజ్-2లో బుధవారం ముత్యాల పోచమ్మ దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, టీపీసీసీ ప్రతినిధి సత్యం శ్రీరంగం, కూకట్‌పల్లి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సుంకన్న, అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోయినుద్దీన్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ సంఘం సభ్యులు

తులసీనగర్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం

అల్లాపూర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని తులసి నగర్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు విధులు నిర్వర్తించిన కొండల్ రెడ్డి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తీర్మానంలో భాగంగా మే 11న మరోసారి సమావేశమై కార్యవర్గ ఎన్నిక అంశాన్ని చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, చెన్న బంగార్, సురేష్, సూర్యచంద్ర, శ్రీనివాస్, శేఖరాచారి, సత్యమ్మ, కిషన్, విజయ్, అంకిత్, మోహన్, ఎల్లయ్య, సురేందర్, సుందర్ పాల్గొన్నారు.

బసవేశ్వర మహరాజ్‌కు నివాళి



బసవేశ్వర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హిందూ వాహిని నేతలు

బాలానగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా వద్ద మహాత్మా బసవేశ్వర మహరాజ్‌కు బాలానగర్ హిందూవాహిని నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చెల్ జిల్లా హిందూవాహిని నాయకులు హన్మంతు, ఈరన్న, నాగప్ప, శరణప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు భవానీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ భవానీనగర్ వీరబ్రహ్మంగారి ఆలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఏ. భార్గవి మనీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. శిబిరంలో ఫుల్ బాడీ చెకప్ చేసుకోవచ్చని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

వెలగని వీధి దీపాలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్‌లో స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదు. చీకట్లో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, చిన్నారులు సాయంత్రం అయిందంటే చీకటితో బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. గల్లీల్లో అలా ఉంచితే మెయిన్ రోడ్లలో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో పర్యటించకుండా కార్యాలయాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కుక్కల బెడదతో స్థానికులు రాత్రి సమయాల్లో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నాలుగో ఫేజ్‌లో వీధి దీపాలు వెలగక చీకట్లు

కార్మికుల శ్రమను గుర్తిద్దాం

దేశాభివృద్ధిలో కీలకంగా కార్మికుల పాత్ర ● నేడు మే డే సందర్భంగా ప్రత్యేక కథనం



కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం కార్మికులు చేసిన పోరాటానికి గుర్తుగా మే డే నిలుస్తుంది. ఆధునిక టెక్నాలజీ యుగంలో చాలా మంది కార్మికుల చేత చేయించుకోవాల్సిన పనులను సాంకేతికత సహాయంతో చేయించుకుంటున్నారు. అయితే ఎంత టెక్నాలజీ ఉన్నా ఎవరు చేయాల్సిన పనులు వారు చేయాల్సిందే. నిర్మాణ రంగంలో తాపీ మేస్త్రీ, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, సెంట్రింగ్, ఫాల్ సీలింగ్, పెయింటర్, టైల్స్ ఫిట్టింగ్ చేసేవారి పాత్ర కీలకం. ప్రస్తుతం ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఓలా, ఉబర్, ర్యాపిడో వంటివి అందుబాటులోకి వచ్చినా ఆ వాహనాలను నడపాల్సింది మాత్రం డ్రైవర్లే. ఇక కేపీహెచ్‌బీ, మూసాపేట్ ప్రాంతాల్లో కార్మికులకు పెద్ద అడ్డాలే ఉన్నాయి. కంపెనీల్లో పనిచేసే వారంతా 95 శాతం మేర రోజూవారి లేదా నెలవారీ కూలీ తీసుకునే కార్మికులే ఉన్నారు. చాలా మందికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం సైతం ఉండదు. కార్మికులు పనిచేస్తున్న ప్రదేశంలో వారికి అవసరమయ్యే పర్సనల్ యాక్సిడెంట్ పాలసీలు, వర్క్‌మెన్ కాంపన్సేషన్ పాలసీలు ఉండేలా సంబంధిత కాంట్రాక్టర్లు, పనిచేయించుకుంటున్న యజమానులు చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. అలాగే కార్మికులు లేబర్ కమిషనర్ కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవడం వల్ల కొన్ని ప్రయోజనాలను అందుకోవచ్చు. కార్మికులు ఐక్యంగా ఉంటూ తోటి కార్మికుడు లేదా కార్మిక కుటుంబం ఆపదలో ఉంటే వారికి అవసరమైన సహాయ, సహకారాలు అందే విధంగా చొరవతీసుకోవాలి.

కార్మికులను గౌరవిద్దాం

మనం ఎంత అభివృద్ధి చెందినా కార్మికులను ఎప్పుడూ చిన్నచూపు చూడకూడదు. టెక్నాలజీతో పనులు వేగంగా చేసుకోవచ్చు కానీ కార్మికులు శ్రమతో చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి. కార్మికులు ఎవరికి వారు అప్డేట్ అయ్యి ఇతర పనుకు వెళ్తే నిత్యం అవసరం అయ్యే ప్లంబర్, ఎలక్ట్రీషియన్, మేస్త్రీ, పెయింటర్ వంటి పనులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఆటోలు, క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్, గ్రాసరీ, కొరియర్ డెలివరీ బాయ్స్ ఎవరి స్థాయిలో వారు దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. అందువల్లే మన పనులు అనుకున్న సమయానికి పూర్తవుతున్నాయన్న విషయం గుర్తుంచుకోవాలి.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మే డే వేడుకలు

కేపీహెచ్‌బీ మూడో ఫేజ్ రమ్య గ్రౌండ్ వద్ద ఉన్న కేపీహెచ్‌బీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న మే డే వేడుకలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు హాజరుకానున్నారు. ఉదయం 8.30 గంటలకు జరిగే వేడుకలకు భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆ సంఘం అధ్యక్షులు సాంబశివరావు ఓ ప్రకటనలో కోరారు.



కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా 15, వంకాయ 18, బెండకాయ 35, పచ్చి మిర్చి 35, బజ్జి మిర్చి 33, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజీ 8, బీన్స్ 65, క్యారెట్ 19, గోబి పువ్వు 18, దొండకాయ 18, చిక్కుడు కాయ 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 45, ఆలుగడ్డ 25, కీర 20, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 15, కంద 75, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 17, మామిడి కాయ 15-20, అరటి కాయ 8-10, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడదుంప 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 60-70, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 80, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 20, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా ముందుకుసాగాలని పార్టీ కార్యకర్తలకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు పిలుపునిచ్చారు. బుధవారం కూకట్‌పల్లిలోని బాలాజీనగర్ డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ అర్బన్‌జిల్లా ఉపాధ్యక్షుడు, బాలాజీనగర్ ఇన్‌చార్జ్ శేఖర్ హాజరై మాట్లాడారు. అధిష్ఠానం ఇచ్చిన ఆదేశాల మేరకు బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, పార్టీ ఆదేశించిన అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ బీజేపీ నూతన సారథి పేరు త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా బూత్‌కమిటీలు పూర్తిచేయాలని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినోద్ కుమార్, వెంకటేశ్వర్‌రెడ్డి, భగవత్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, అనిల్, సంతోష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ డివిజన్ నాయకులతో సమావేశమైన మాధవరం కాంతారావు, శేఖర్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న యువకుల ముఠాను కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఏప్రిల్ 29న రాత్రి 10 గంటల తర్వాత కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో స్థానికులకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1045 గ్రాముల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకొని గురువారం వారిని రిమాండ్‌కు తరలించారు. బలుసా సాయి (24), వల్లె ప్రశాంత్ (26), మాదారపు వంశీ (19), ఏదునూరు విష్ణు(21), రాసమల్ల అంజనేయులు (22), బొచ్చు వెంకటేష్ (21)లను అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలో 75 ప్యాకెట్లను కొనుగోలు చేసి ఒక్కోటి రూ.200 చొప్పున విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. మహారాష్ట్రకు చెందిన అంజాద్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అర్హులను పదవులకు ఎంపిక చేస్తాం

సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

ఫతేనగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో స్వీకరించిన ధరఖాస్తులను వడపోసిన అనంతరం అర్హులైన వారికి, పార్టీ పట్ల ఉన్న సిన్సియారిటీ, సీనియారిటీని పరిగణలోకి తీసుకుని పదవులకు ఎంపిక చేస్తామని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జిల్లా పరిశీలకులు పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మూసాపేట రాయల్ ఫంక్షన్ హాలులో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ నేతృత్వంలో జరిగిన నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని సూచనలు చేశారు. ఏ బ్లాక్, బి బ్లాక్ డివిజన్ అధ్యక్షులను త్వరలో ఎంపిక చేసి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, మార్కెట్, టెంపుల్ కమిటీ సభ్యులు, బ్లాకు నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, పారిజాతారెడ్డి తదితరులు

ఉరేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్య



భీమ్‌రావు (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన బి.భీమ్‌రావు (43) ఆటో డ్రైవర్. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో లోధా గేటెడ్ కమ్యూనిటీ ఎదురుగా ఉన్న జంగిల్‌లో చెట్టుకు ఉరేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి పూర్తి వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడు నెల రోజుల క్రితం గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఐదు రోజుల క్రితం మళ్లీ రాగా ఆటో రిపేర్ కోసం రూ.500 ఇచ్చినట్లు చెప్పింది. 29న ఇంటికి రావాలా అని అడగడంతో తాగకుండా వస్తే రా లేకపోతే వద్దని చెప్పడంతో గత సంఘటనల గురించి ఆలోచించి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు

వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

ఖైల్‌కాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన భెల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర, యోగేశ్వర స్వామి ఆలయ 57వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 1969లో కార్మికులు, కాలనీవాసులు, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలంతా కలిసి నిర్మించుకున్న ఆలయ ప్రాంగణంలో క్రమేపీ పదుల సంఖ్యలో ఆలయాల నిర్మాణం జరిగింది. ఆలయ నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ప్రతి ఏటా వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది మే 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సుమారు 50వేల మంది భక్తులు హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడు రోజుల పాటు జరిగే వేడుకల్లో ప్రతిరోజూ సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను గరుడ, శేష, ఆది, సింహ, గజ, హంస వాహనాలపై దేవాలయ నలు దిక్కుల్లో ఊరేగించనున్నారు. ప్రతిరోజూ మహామండపంలో సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రవచనాలను వల్లిస్తారు. యాగశాలలో నిత్యం ప్రత్యేక హోమాలను నిర్వహించనున్నారు. మే 6న స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించిన శుభదినాన్ని పురస్కరించుకుని విశేష పూజలు, అభిషేకాలు, స్వామివారి కల్యాణ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మే 7న కాలనీలో శ్రీవారి రథోత్సవం, మే 8న ఆలయ ప్రాంగణంలోని స్వామివారి పుష్కరిణిలో చక్రస్నానం, అన్న సమారాధనతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



భెల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం

బాత్రూంలో జారిపడి వ్యక్తి మృతి

బాలానగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బాత్రూంలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. యూపీకి చెందిన చత్రపాల్ (44) సత్రూప దంపతులు బతుకు తెరువు కోసం నగరానికి వలస వచ్చి బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధి రంగారెడ్డినగర్‌లో నివాసముంటున్నారు. చత్రుపాల్ స్థానికంగా ఉన్న ఓ గ్లాస్ కంపెనీలో లేబర్ పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో కంపెనీకి వెళ్లేందుకు స్నానం చేసి వస్తానని బాత్రూంలోకి వెళ్లాడు. 45 నిముషాలు దాటినా బయటకు రాకపోవడంతో భార్యకు అనుమానం వచ్చి తలుపు తీసి చూసింది. చత్రపాల్ బాత్రూంలో అపస్మారక స్థితిలో పడి ఉండడంతో ఇరుగుపొరుగు వారి సహాయంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న చత్రపాల్ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. భార్య సత్రూప ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న బాలానగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో అక్షయ తృతీయ పూజలు

ఖైల్‌కాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా భెల్ టౌన్‌షిప్, ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ కాలనీల్లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం అక్షయ తృతీయ పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారికి సుగంధ ద్రవ్యాలు, పుష్పాలు, ఫల పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. లక్ష్మీ అమ్మవారికి సహస్రనామార్చన, అభిషేకాలు చేశారు. శ్రీనివాసుడి ఆలయంలో పద్మావతి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



చందనం అలంకరణతో దర్శనమిచ్చిన నరసింహస్వామి

భూములకు రక్షణ కవచం 'భూ భారతి'

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం రైతుల భూములకు రక్షణ కవచం వంటిందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందన్నారు. భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని.. దీంతో సరైన న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉంటుందన్నారు. నూతన చట్టంపై రైతులంతా అవగాహన పెంచుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాలకు సైతం భూ భారతితో పరిష్కారం లభిస్తుందన్నారు. జూన్ నుంచి తహసీల్దార్లు గ్రామాల్లో పర్యటించి భూ భారతి సదస్సులు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

'పది'లో ప్రభుత్వ బడుల సత్తా

కూకట్‌పల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కూకట్‌పల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ శంషిగూడ 88.80 శాతం, హైదర్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 88.24 ఉత్తీర్ణత శాతం సాధించారు. మండలం పరిధిలోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 876 మందికి గాను 659 మంది పాసయ్యారు. కూకట్‌పల్లి మండలంలో 75.23శాతం విద్యార్థులు పదిలో ఉత్తీర్ణత సాధించారు. అందులో హైదర్‌నగర్ తెలుగు మీడియం 65.63శాతం, ఇంగిష్‌మీడియం 88.24శాతం, జెడ్పీహెచ్ఎస్ కూకట్‌పల్లి తె/మీ 70.27 శాతం, ఇ/మీ 67.61 శాతం, జెడ్పీహెచ్ఎస్ (బాలురు) మూసాపేట తె/మీ 52.63 శాతం, ఇ/మీ 64.44 శాతం, మూసాపేట బాలికలు తె/మీ 52.38, ఇ/మీ 77.40 శాతం, జెడ్పీహెచ్ ఆర్‌పీకాలనీ తె/మీ 76.47 శాతం, ఇ/మీ 79.21 శాతం, శంషీగూడ తె/మీ 62.50శాతం, ఇ/మీ 88.80 శాతం, ఎల్లమ్మబండ తె/మీ 75.86 శాతం, ఇ/మీ 84.78శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటాయి.



బిందుశ్రీ (549), కూకట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్



అమృతవల్లి (542), కూకట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్

ఓల్డుబోయినపల్లిలో..

ఓల్డుబోయినపల్లి డివిజన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 65 మంది పరీక్షలకు హాజరు కాగా 50 యంది ఉత్తీర్ణులైనట్లు స్కూల్ హెచ్ఎం మల్లయ్య తెలిపారు. వీరిలో మాడెపు శివనందిని(563), పలిగిల్ల రుతిక (558), పావని(543) మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచారు.

బాలానగర్ పాఠశాలలో..

బాలానగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బాలానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి ఫలితాలలో 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్ఎం అరుణ్‌జ్యోతి తెలిపారు. మొత్తం 73 మంది పరీక్షలకు హాజరుకాగా 62 మంది పాసైనట్లు చెప్పారు. పులి ప్రజ్వలిక (543), బోయినోలు అనిత (540), శిరీష (521) మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచినట్లు ఆమె చెప్పారు.



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

విద్యార్థులు దేశ సంస్కృతిపై అవగాహన పెంచుకోవాలి

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు దేశ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని పటాన్‌చెరు నియోజక వర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి సూచించారు. బీహెచ్‌ఈఎల్ ఎల్ఐజీకాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలోగణపతి సచ్చిదానంద స్వామి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉత్తమ కళాకారులు, విద్యావంతులు, క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ వ్యవస్థలు విద్యార్థులకు నైతిక విలువలు తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన రవికుమార్‌యాదవ్

చలివేంద్రం ప్రారంభం

చందానగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకు చల్లివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్ అన్నారు. అలిగిరి వెంకటేష్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యుడు అలిగిరి అర్జున్ ఆధ్వర్యంలో చందానగర్ స్వాగత్ హోటల్ ఎదురుగా బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రవికుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం పలువురికి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్, నవీన్, జాన్‌వెస్లీ, హరీష్ శామ్యూల్ వెంకీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా సుబ్రమణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించగా బుధవారం విశేష ఫల పంచామృతాభిషేకం, శాంతి కల్యాణంతో వేడుకలు ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ, క్షీరాభిషేకం, యాగశాలలో హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాల్లో అక్షయ తృతీయ పూజలు

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా భెల్ టౌన్‌షిప్, ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ కాలనీల్లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం అక్షయ తృతీయ పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారికి సుగంధ ద్రవ్యాలు, పుష్పాలు, ఫల పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. లక్ష్మి అమ్మవారికి సహస్రనామార్చన, అభిషేకాలు చేశారు. శ్రీనివాసుడి ఆలయంలో పద్మావతి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.



చందనం అలంకరణతో దర్శనమిచ్చిన నరసింహస్వామి

కునుకు కరువు..!

- బొటానికల్ గార్డెన్ ఎదురుగా పెద్ద పెద్ద శబ్దాలతో నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

రాయదుర్గం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఓ బడా నిర్మాణ సంస్థ రాత్రి పగలు తేడా లేకుండా పెద్ద పెద్ద శబ్దాలతో పనులు చేస్తుండటంతో చుట్టు పక్కల కాలనీలవాసులకు కంటి మీద కునుకు కరువవుతోంది. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్ ఎదురుగా ఓ బడా నిర్మాణ సంస్థ గత కొంత కాలంగా అపార్టుమెంటు నిర్మాణం కోసం సెల్లార్ తవ్వకాలు చేపడుతుంది. అయితే సెల్లార్ తవ్వుతున్న క్రమంలో వెలువడే బండరాళ్లను పగులగొట్టేందుకు బ్లాస్టింగులు చేస్తున్నారు. పేలుళ్లతో వెలువడే పెద్ద పెద్ద శబ్ధాలతో ఆ ప్రాంతానికి ఆనుకొని ఉన్న చుట్టు పక్కన కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజంతా పనులు చేసి అలిసిపోయి ఇంటికి వచ్చే వారికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. చిన్న పిల్లలు, వృద్ధులు ఈ శబ్దాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సమస్యను చెప్పి రాత్రి సమయాల్లో పనులను నిర్వహించవద్దని విజ్ఞప్తి చేసినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నాళ్లుగా ఈ సమస్యతో తమ పిల్లల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదుల సంఖ్యలో వాహనాలు..

పదుల సంఖ్యలో టిప్పర్లు, జేసీబీలతో మట్టిని తొవ్వి తరలిస్తున్నారు. ఈ క్రమంలో తవ్వకాల్లో పెద్ద ఎత్తున బండ రాళ్లు వెలికి వస్తున్నాయి. వాటిని చిన్న ముక్కలుగా పగులగొట్టి టిప్పర్ల ద్వారా మరో ప్రాంతానికి తరలిస్తున్నారు. అయితే ఈ పనులను రాత్రి సమయాల్లో నిర్వహిస్తున్న క్రమంలో బండరాళ్ల శబ్ధాలు, టిప్పర్ల మోత పెద్ద ఎత్తున వస్తుంది. దీంతో ఈ పనులు జరుగుతున్న ప్రాంతానికి ఆనుకొని ఉన్న నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జీహెచ్ఎంసీ సర్కిల్ 20 ఏసీపీ వెంకటరమణ, సాయినాథ్, సెక్షార్ ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.



సమస్యకు కారణమైన ప్రాంతంలో జరుగుతున్న పనులు

జాతీయ వాతావరణ మేనిఫెస్టోపై ముగిసిన సమావేశం

రాయదుర్గం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీసీఎస్ ద్వారా స్వల్పకాలిక, దీర్ఘకాలిక వాతావరణ చర్యలతో పాటు మానవ సంక్షేమాన్ని మెరుగుపర్చడం లక్ష్యంగా భారత ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఈపీటీఆర్ఐ క్లైమేట్ చేంజ్ సెంటర్ హెడ్ డాక్టర్ జె.రాజేశ్వరి అన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ ఈపీటీఆర్ఐ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా రెండు రోజుల భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 2047 కోసం జాతీయ వాతావరణ కార్యాచరణ మేనిఫెస్టోపై సమావేశం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో డీఎస్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ స్వాతిజైన్, డీఎస్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ అనితాగుప్తా ముగింపు ప్రసంగం చేశారు.

భూములకు రక్షణ కవచం 'భూ భారతి'

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం రైతుల భూములకు రక్షణ కవచం వంటిందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందన్నారు. భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని.. దీంతో సరైన న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉంటుందన్నారు. నూతన చట్టంపై రైతులంతా అవగాహన పెంచుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాలకు సైతం భూ భారతితో పరిష్కారం లభిస్తుందన్నారు. జూన్ నుంచి తహసీల్దార్లు గ్రామాల్లో పర్యటించి భూ భారతి సదస్సులు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

'పది' ఫలితాల్లో ప్రభుత్వ బడుల సత్తా

గచ్చిబౌలి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పది ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. మండలంలోని 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 1094 మంది పరీక్షలు రాశారు. ఇందులో 757 మంది పాస్ అయ్యారు. ఈ సంవత్సరం మండలంలో 68 శాతం ఫలితాలు సాధించినట్ల మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు.

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో..

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం 114 మంది పరీక్ష రాయగా, 112 మంది ఉత్తీర్ణత సాధించారు. కధావత్ రోహిణి 534 మార్కులు, వడ్ల వైశాలి 528, చేతన 527 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.



రోహిణి (534)



వడ్ల వైశాలి (527)

గురుకుల పాఠశాలలో..

రాయదుర్గం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో గౌలిదొడ్డి గురుకుల పాఠశాల బాలికలు సత్తాచాటారు. 74 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. జ్యోతి 583, తేజశ్రీ 580, హరిణి 574, మేఘన 573, అఖిల 571 మార్కులు సాధించి సత్తా చాటారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

మియాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని వాటర్ ట్యాంకర్ వెనకనుంచి ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం, కొడమంచి గ్రామానికి చెందిన బి.అశోక్ (42) భార్య బిందు, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడితో కలిసి ఫీరోజ్ గూడలో ఉంటున్నాడు. కార్గోలో ప్రైవేట్ ఉద్యగం చేస్తున్నాడు. ముత్తంగి గ్రామం వద్ద ఉద్యోగ పనుల నిమిత్తం బుధవారం ఉదయం ద్విచక్రవాహనం స్కూటీపై అశోక్ వెళ్లాడు. ఉద్యోగ పనులను ముగించుకొని తిరిగి ఇంటికి బయలుదేరాడు. 7 గంటల సమయంలో మియాపూర్ మదీనాగూడ జీఎస్ఎల్ ముందు జాతీయ రహదారిపైకి రాగానే వెనుక నుంచి వాటర్ ట్యాంకర్ స్కూటీని ఢీకొట్టింది. అశోక్ కిందపడగా అతనిపైనుంచి ట్యాంకర్ వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ పరారయ్యాడు. అశోక్ మృతికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అశోక్ తండ్రి పోచయ్య ఈ నెల 9వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. 20 రోజుల్లోనే కుమారుడు అశోక్ ఇలా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆరోగ్యంపై అవగాహన



అంతర్జాతీయ సంస్థ బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ సిగ్మా హాస్పిటల్స్‌తో కలిసి మాదాపూర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేసింది. దీంతో పాటు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు ప్లకార్డులను ప్రదర్శించి ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, సిగ్మా హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, ఓ న్యూస్ చానెల్ చైర్మన్ లక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు.

- హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న యువకుల ముఠాను కూకట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఏప్రిల్ 29న రాత్రి 10 గంటల తర్వాత కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో స్థానికులకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1045 గ్రాముల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకొని గురువారం వారిని రిమాండ్‌కు తరలించారు. బలుసా సాయి (24), వల్లె ప్రశాంత్ (26), మాదారపు వంశీ (19), ఏదునూరు విష్ణు(21), రాసమల్ల ఆంజనేయులు (22), బొచ్చు వెంకటేష్ (21)లను అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలో 75 ప్యాకెట్లను కొనుగోలు చేసి ఒక్కోటి రూ.200 చొప్పున విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. మహారాష్ట్రకు చెందిన అంజాద్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన బి.భీమ్‌రావు (43) ఆటో డ్రైవర్. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో లోధా గేటెడ్ కమ్యూనిటీ ఎదురుగా ఉన్న జంగిల్‌లో చెట్టుకు ఉరేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి పూర్తివివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడు నెల రోజుల క్రితం గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఐదు రోజుల క్రితం మళ్లీ రాగా ఆటో రిపేర్ కోసం రూ.500 ఇచ్చినట్లు చెప్పింది. 29న ఇంటికి రావాలా అని అడగడంతో తాగకుండా వస్తే రా లేకపోతే వద్దని చెప్పడంతో గత సంఘటనల గురించి ఆలోచించి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఖేల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం

రేపటి నుంచి శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు

- వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన భెల్ టౌన్‌షిప్‌లోని వెంకటేశ్వర, యోగేశ్వర స్వామి ఆలయ 57వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 1969లో కార్మికులు, కాలనీవాసులు, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలంతా కలిసి నిర్మించుకున్న ఆలయ ప్రాంగణంలో క్రమేపీ పదుల సంఖ్యలో ఆలయాల నిర్మాణం జరిగింది. ఆలయ నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ప్రతి ఏటా వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది మే 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సుమారు 50వేల మంది భక్తులు హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడు రోజుల పాటు జరిగే వేడుకల్లో ప్రతి రోజూ సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను గరుడ, శేష, ఆది, సింహ, గజ, హంస వాహనాలపై దేవాలయ నలు దిక్కుల్లో ఊరేగించనున్నారు. ప్రతి రోజూ మహామండపంలో సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రవచనాలను వల్లిస్తారు. యాగశాలలో నిత్యం ప్రత్యేక హోమాలను నిర్వహించనున్నారు. మే 6న స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించిన శుభదినాన్ని పురస్కరించుకుని విశేష పూజలు, అభిషేకాలు, స్వామివారి కల్యాణ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మే 7న కాలనీలో శ్రీవారి రథోత్సవం, మే 8న ఆలయ ప్రాంగణంలోని స్వామివారి పుష్కరిణిలో చక్రస్నానం, అన్న సమారాధనతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

ఘనంగా బసవ జయంతి

చందానగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విద్యతోనే విషయ పరిజ్ఞానం ఏర్పడుతుందని, పోరాటంతోనే సమానత్వం వస్తుందని చెప్పడంతో పాటు దానికోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు బసవేశ్వరుడని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బసవేశ్వర జయంతిని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో హుడా కాలనీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ. పలువురు కార్పొరేటర్లతో కలిసి హాజరయ్యారు. బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న కమాండెంట్ రామకృష్ణ

ఉద్యోగ విరమణ సన్మానం

గచ్చిబౌలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణమని కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ అన్నారు. బెటాలియన్‌లో దాదాపు 30 సంవత్సరాలు సేవలందించిన వెంకటేశ్వరరావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు దంపతులను బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉండాలని, ఏ ఆపదొచ్చినా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

జోనల్ కమిషనర్‌గా హేమంత్ బాధ్యతల స్వీకరణ

గచ్చిబౌలి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా హేమంత్ సహదేవ్‌రావు బుధవారం బాధ్యతలు సేకరించారు. ఇక్కడ పనిచేసిన ఉపేందర్ రెడ్డి హుడా ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. హేమంత్ గతంలో ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు.

అర్హులను పదవులకు ఎంపిక చేస్తాం

- సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

ఫతేనగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో స్వీకరించిన దరఖాస్తులను వడపోసిన అనంతరం అర్హులైన వారికి, పార్టీ పట్ల ఉన్న సిన్సియారిటీ, సీనియారిటీని పరిగణలోకి తీసుకుని పదవులకు ఎంపిక చేస్తామని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జిల్లా పరిశీలకులు పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మూసాపేట రాయల్ ఫంక్షన్ హాలులో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ నేతృత్వంలో జరిగిన నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని సూచనలు చేశారు. ఏ బ్లాక్, బి బ్లాక్ డివిజన్ అధ్యక్షులను త్వరలో ఎంపిక చేసి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, మార్కెట్, టెంపుల్ కమిటీ సభ్యులు, బ్లాకు నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, పరిశీలకులు పారిజాతారెడ్డి తదితరులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా స్టేడియం

- చందానగర్ పీజేఆర్ స్టేడియంలో పనిచేయని సీసీ కెమెరాలు
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

చందానగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియం దొంగతనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాలు తగ్గుముఖం పట్టాయి. అయితే రెండేళ్ల పాటు పనిచేసిన కెమెరాలు కరోనా అనంతరం మరమ్మతుల కారణంగా పనిచేయడం లేదు. దీంతో స్టేడియంలో దొంగతనాలు పెరుగుతున్నాయి. స్టేడియంలోని క్రీడా సామగ్రిని దొంగలు తీసుకెళ్తున్నారు. 8 మంది వాచ్‌మెన్లు ఉండాల్సి ఉన్నప్పటికీ కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. దీంతో క్రీడాకారుల వాహనాలు సైతం చోరీకి గురవుతున్నాయి. స్టేడియంలో 20కి పైగా సైకిళ్లు చోరీకి గురయ్యాయని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిష్ట వేస్తున్న మందుబాబులు

స్టేడియంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలుసుకున్న కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రి సమయంలో మందుబాబులు తిష్ట వేస్తున్నారు. కొందరు యువతీ యువకులు జంటలుగా వచ్చి వికృత చేష్టలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. స్టేడియంలో జరుగుతున్న నిర్వాకాలపై క్రీడాకారులు అధికారులను సంప్రదించగా దొంగతనాలు తమ పరిధిలోకి రావని పోలీసులను ఆశ్రయించాలని చెబుతున్నారు. అయితే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేసే ప్రయత్నం మాత్రం చేయడం లేదని క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి స్టేడియంలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని క్రీడాకారులు, స్థానికులు కోరుతున్నారు.



చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

స్టేడియంలో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. కెమెరాలు పనిచేయకపోవడంతో స్టేడియంలో కొందరు ఆకతాయిలు తిష్టవేస్తున్నారు. మరోవైపు దొంగలు సైతం రెచ్చిపోతున్నారు. దీనిపై అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. మరోసారి అధికారులను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

- వీరానంద్, వెస్ట్ జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్


ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

గాజులరామారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని, ఆలయాల సందర్శనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం ఆయన గాజులరామారం డివిజన్ మహాదేవ పురంలోని షిరిడీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులుండాలి

జీడిమెట్ల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవిహిల్స్‌లోని సమయపురం మారమ్మ మహాలక్ష్మి ఆలయంలో నిర్వహించిన పూజలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరయ్యారు. అమ్మవారు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ ఛైర్మన్ మన్నె రాజు, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ నాగరాజుయాదవ్, మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.


ప్రగతినగర్ వీధుల్లోని చెత్తను తొలగింపజేస్తున్న శానిటేషన్ అధికారి

ఎట్టకేలకు చెత్తను తొలగించారు!

నిజాంపేట్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 'చెత్తకు కేరాఫ్‌గా ప్రగతినగర్' అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్తా కథనానికి నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ సాబేరు అలీ, శానిటేషన్ అధికారి సుకృతారెడ్డిలు స్పందించారు.సుకృతారెడ్డి బుధవారం ఉదయం పారిశుధ్య సిబ్బందితో కలిసి ప్రగతినగర్ వెళ్లి పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. అదే విధంగా చెత్తను చెత్త డబ్బాల్లో వేయకుండా ఇళ్ల ముందు వేసిన వారికి రూ. వెయ్యి జరిమానా విధించారు. ఇక నుంచి ఎవరైనా చెత్తను డబ్బాలో కాకుండా వీధుల్లో, మూలమలుపుల వద్ద ఇష్టానుసారంగా వేస్తే జరిమానాలు భారీగా విధిస్తామని సుకృతారెడ్డి హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అగ్రిమెంట్ పత్రాలను డిప్యూటీ కమిషనర్‌కు అందజేస్తున్న మదన్‌గౌడ్

వేతన ఒప్పందం చేసుకున్న 'ఎయిర్‌లైన్స్ సైన్స్' కార్మికులు

షాపూర్‌నగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని ఎయిర్‌లైన్స్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం వేతన ఒప్పందం చేసుకున్నారు. కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ శ్యాంసుందర్ జాజు ఆధ్వర్యంలో పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు ముద్దాపురం మదన్‌గౌడ్ సమక్షం లో అగ్రిమెంట్ వివరాలు తెలియజేయగా, కార్మికులందరూ ఐక్యంగా దానిని ఆమోదించారు. ప్రతి ఉద్యోగి వేతనం రూ.10,600 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవికుమార్, యూసఫ్, సుభాష్, రామ్‌బాబు, నాగేంద్రబాబు, వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, నరసింహరెడ్డి, సత్యనారాయణ, వైకుంఠరావు, మధు పాల్గొన్నారు.

రెండు నెలలుగా

దారి లేక అవస్థలు

- డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్లను తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్లు
- ఇంటి ముందు మట్టి గుట్టలు, పెద్ద గొయ్యిలు
- అడుగుబయట పెట్టే వీలులేక సాయినగర్ కాలనీవాసుల అగచాట్లు


ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

నిజాంపేట్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కాలనీవాసులకు శాపంగా మారింది. పైప్‌లైన్ డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్లను తవ్వి పనులు పూర్తి చేయకుండా వదిలేయడంతో నానా అవస్థలు పడుతున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ సాయినగర్‌లో రెండు నెలలు క్రితం రోడ్ల మధ్యలో లోతుగా తవ్వి మట్టిని ఇళ్ల ముందు ఇరువైపులా వేశారు. దీంతో ఇంటి నుంచి రోడ్డుపై అడుగుపెట్టే పరిస్థితి లేకుండాపోయిందని కాలనీవాసులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, తమ దుస్థితిని ఎవ్వరికి చెప్పాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గడపల వరకూ మట్టి..

ఇంటి గడపల వరకు వచ్చిన మట్టి, ఏదో విధంగా ముందుకు వెళ్దామంటే ప్రమాదకరంగా ఉన్న గొయ్యి. ఈ సమస్యతో రెండు నెలలుగా సాయినగర్ వాసులు అల్లాడి పోతున్నారు. అత్యవసర పనిపై బయటకు వెళ్తూ పలువురు కాలు జారి పైప్‌లైన్ గొయ్యి పడిపోయిన ఘటనలు కూడా జరిగాయి. రెండు నెలలుగా తమ కాలనీ వీధుల్లోకి ద్విచక్ర వాహనాలు, కార్లు రాలేదని, కాలనీ అవతల పార్కింగ్ చేసుకుంటున్నామని స్థానికులు తెలిపారు. మున్సిపల్ అధికారులు రోడ్డు సమస్యతో తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని త్వరగా పైప్‌లైన్ పనులను పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


సాయినగర్ రోడ్డు మధ్యలో డ్రైనేజీ కోసం తవ్విన రోడ్డు


ఇళ్ల ముందు మట్టి


పూర్తికాని డ్రైనేజీ పనులు

మా అబ్బాయి పెళ్లి ఎలా చేయాలో తెలియడం లేదు



సాయినగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ వేసి, ఆ తర్వాత రోడ్డు పనులు మొదలు పెడతామంటూ రెండు నెలల క్రితం కాంట్రాక్టర్లు కాలనీ రోడ్డు మధ్యలో లోతైన గొయ్యిలు తవ్వారు. పనులను మధ్య నిలిపివేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మే మొదటి వారంలో మా ఇంట్లో మా కుమారుడి వివాహం పెట్టుకున్నాం. రోడ్డు లేకపోవడంతో ఇక్కడ పెళ్లి ఎలా చేయాలో అర్థం కావడం లేదు. ఈ పనులు పూర్తి కావడానికి ఇంకా ఎంత కాలం పడుతుందో తెలియడం లేదు.

నహీమ్, సాయినగర్ కాలనీవాసి


వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న శ్రీశైలంగౌడ్

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: కూన

షాపూర్‌నగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో పాటు స్థానికుల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు తమ ప్రాంతంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలులో అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

జీడిమెట్ల , ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని షాపూర్‌నగర్ చౌరస్తాలో మంగళవారం రాత్రి అశోక్ అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా అతి వేగంతో దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న జీడిమెట్ల పోలీసులు 108లో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సర్కార్ బడుల్లో ఉత్తమ ఫలితాలు

- 'పది'లో 73.67 శాతం ఉత్తీర్ణత
- ప్రైవేట్ పాఠశాలలకంటే అధికం

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దుండిగల్, బాచుపల్లి, కుత్బుల్లాపూర్ మండలాల్లో మొత్తం 21 ఉన్నత ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1990 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 1466 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 73.67 శాతాన్ని సాధించారు. బహదూర్‌పల్లి హైస్కూల్ 90.7 శాతంతో నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలువగా, రెండవ స్థానంలో 83.1 శాతం, దూలపల్లి ప్రభుత్వ పాఠశాల భగత్‌సింగ్‌నగర్ హైస్కూల్ 66.6 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే ఈ యేడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి ప్రైవేట్ పాఠశాలలకంటే ఉత్తీర్ణతా శాతాన్ని పెంచారు. కుత్బుల్లాపూర్‌లోనే అత్యధికంగా జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దొడ్ల శరణ్య 571 మార్కులు సాధించి నియోజకవర్గంలోనే టాపర్‌గా నిలిచింది. గణితశాస్త్రంలో 98 మార్కులు సాధించింది. అదే పాఠశాలలో చదువుతున్న దొంతు స్పందన 548 మార్కులు రాగా, సాంఘీకశాస్త్రంలో 98 మార్కులు సాధించింది. గాజులరామారం జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన రమావత్ విజయ 545 మార్కులు సాధించడం గర్వకారణం. షాపూర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న స్నేహ, ఉమ్మె అయ్‌మన్ 511 మార్కులు సాధించారు.


రమావత్ విజయ (545)


దొంతు స్పందన (548)


దొడ్ల శరణ్య (571)

గుంతలను పూడ్చడంలో నిర్లక్ష్యం.. ప్రమాదాల బారిన జనం

గాజులరామారం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మూడు నెలల నుంచి రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదల బారిన పడుతున్నారు. మహాదేవపురం చౌరస్తాలో పెద్దపెద్ద గుంతలుపడి వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ చౌరస్తా రద్దీగా ఉండటం, మూల మలుపుకావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా గుంతలు నీటితో నిండిపోయి వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది స్పందించి రోడ్డు గుంతలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మహాదేవపురం చౌరస్తాలో రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

పార్కు స్థలంలో అక్రమ ఫెన్సింగ్ తొలగింపు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి పురపాలక సంఘంలోని జయభేరిలోని పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో అధికారులు బుధవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చి వేశారు. పార్కు స్థలం పక్కనే ఉన్న ఓ ప్లాట్ యజమాని పార్కు స్థలాన్ని కలుపుకొని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బి. ప్రశాంత్ గౌడ్ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు పార్కు స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను నేల మట్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎవరైనా పార్కు స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రహరీని కూల్చి వేసిన అధికారులు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీని కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చి వేశారు. జీడిమెట్ల డివిజన్‌లోని గార్డెన్ బస్తీ ఏర్పడి దాదాపు 20 ఏళ్లు అవుతుంది. బస్తీ ఏర్పడినప్పుడు ఆ ప్రాంతంలో బావి ఉండేది. బావిలో చెత్తాచెదారం వేయడంతో మొత్తం నిండిపోయింది. దీంతో ఆ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి, ప్రహరీని నిర్మించారు. దీంతో బస్తీవాసులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం కూల్చి వేశారు. స్థానికులు ఈ స్థలాన్ని పార్కుకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బ్రిడ్జి నిర్మించాలని మంత్రికి వినతి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ నుంచి జాతీయ రహదారికి వచ్చే రోడ్డులో ఉన్న బ్రిడ్జి వద్ద నూతన బ్రిడ్జి నిర్మించాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు మేడ్చల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు డి.శ్రావణ్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. మంజీరా పైప్‌లైన్ ఈ రహదారిని ఆనుకొని ఉందని, నాలాపై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో పాటు బ్రిడ్జి వెడల్పు తక్కువగా ఉండటం వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఇక్కడ కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని తొందరగా చేపట్టేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని వినతి పత్రంలో శ్రావణ్ కుమార్ కోరారు.


శ్రావణ్‌కుమార్ ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రతిభ చాటిన నార్త్‌సిటీ స్కూల్ విద్యార్థులు

షాపూర్‌నగర్, ఏప్రిల్ 30(ఆంధ్ర జ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం నార్త్‌సిటీ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటి పాఠశాలను అగ్రస్థానంలో నిలిపారు. ఎస్ఎస్‌సీ 2024-25 పరీక్షలో అనుష్క మానే 586 మార్కులతో అగ్రస్థానంలో నిలువగా, మరో విద్యార్థి వివేక్ 571 మార్కులతో పాఠశాలలో ద్వితీయస్థానం సాధించాడు. స్కూల్ కరస్పాండెంట్ వెంకటేష్ ముదిరాజ్ పరీక్షా ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు.


అనుష్క మానే (586)


వివేక్ (571)

వ్యవసాయ భూమిలో షట్టర్ల నిర్మాణం

- అధికారులపై కాంగ్రెస్ నాయకుడి ఒత్తిడి
- అక్రమ నిర్మాణాలను అడ్డుకోని వైనం

దుండిగల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ దొమ్మర పోచంపల్లి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న వ్యవసాయ భూమిలో కనీస అనుమతులు లేకుండా ఏకంగా పది షట్టర్ల నిర్మాణానికి ఆ భూమి యజమానులు శ్రీకారం చుట్టారు. అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాల గురించి అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారు. మున్సిపల్ అనుమతి తీసుకుంటే ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. కానీ ప్రధాన రోడ్డు పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా బాహాటంగానే షట్టర్లను నిర్మిస్తున్నారు. ఒక దశలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది అడ్డుకోవడానికి వెళ్లగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న స్థానిక నాయకుడు ఒకరు ఆ నిర్మాణాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కమిషనర్‌కు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి హుకుం జారీ చేసినట్లు తెలిసింది. అధికార పార్టీ ఒత్తిళ్లతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో తమకు ఎదురే లేదన్న విధంగా నిర్మాణదారులు అక్రమంగా షట్టర్ల నిర్మాణాన్ని పూర్తి చేసి చివరి దశకు తీసుకువచ్చారు. ఇలా ఉండగా, దీని పక్కనే మరో వ్యక్తి రెండు షెడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అద్దెకు ఇవ్వబడును అనే బోర్డును కూడా ఏర్పాటు చేశాడు. ఈ షెడ్లను అధికారులు తొలగించక పోవడంతో తన పది నిర్మాణాలను కూడా అధికారులు తొలగించరనే ధీమాతో కాంగ్రెస్ పార్టీ అండదండలతో నిర్మాణాలను కొనసాగిస్తున్నట్లు తెలిసింది.


దొమ్మర పోచంపల్లి ప్రధాన రోడ్డు పక్కన నిర్మిస్తున్న షట్టర్లు


నిర్మాణం పూర్తయి అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న షట్టర్లు

ఆర్ఐలను కాదు.. తహసీల్దార్లను బదిలీ చేయాలి

- బీజేపీ నేత ఆకుల సతీష్ డిమాండ్

దుండిగల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గత ప్రభుత్వం నుంచి తహసీల్దార్లుగా పని చేస్తున్న బాచుపల్లి, దుండిగల్ తహసీలార్‌లను తక్షణమే బదిలీ చేయాలని బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారినా తహసీల్దార్‌లను మార్చకపోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. ఇక్కడ పని చేస్తున్న ఆర్ఐలను అధికారులు బదిలీలు చేయడం వల్ల ఫలితం ఉండదని కబ్జాదారులకు సహకరిస్తున్న తహ సీల్దార్లను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులు కూడా నోరు మెదపడం లేదని ఆయన విమర్శించారు.